

# పరదేశీ కథలు

## – చిట్టే సిద్ధ లలిత



– 137 –

# ఎడారి మేఘం

**రాజమ్మది రాయచోటి దగ్గర మల్లంపల్లి అనే గ్రామం.** నిరుపేద కుటుంబాలు కావడంతో ఆ ప్రాంతంలో అందరూ కువైట్ వెళ్ళి డబ్బు సంపాదించుకుని మిద్దెలు మేడలు కట్టుకుంటున్నారు. కాబట్టి తానూ ఇద్దరు పిల్లల భవిష్యత్ కోసం మెడలోని తాళిబొట్టు చైనును తాకట్టుపెట్టి కువైట్ వెళ్ళింది.

అక్కడ ఒక అరబ్ సేటు ఇంట్లో పనిమనిషిగా చేరింది. డబ్బు ధ్యాసలో పడి మధ్యలో ఇంటికి కూడా రాకుండా పదేళ్ళ కాలాన్ని కువైట్ లోనే గడిపింది. యజమానుల ఛీత్కారాలు, వళ్ళు నొప్పులు, అనారోగ్యాలు బాధిస్తున్నా కష్టం మీద భరిస్తూ ప్రతినెలా తన రెక్కల కష్టాన్ని ఊరిలో ఉన్న భర్త రాముకు పంపేది.

ఎప్పటికప్పుడు "ఇంకొక్క రెండేళ్లు కష్టపడితే మనకంటూ ఒక సొంత ఇల్లు, పిల్లల చదువులకు సరిపడా డబ్బు సమకూరుతుంది" అని ఫోన్లో చెప్పి మురిసిపోయేది. కలల ప్రపంచంలో తేలి ఆడేది. అలా కువైట్ లో పదేళ్ల కాలం గడిచిపోయింది.

ఆ ఇంట్లో వున్న పదిమందికి మూడుపూటలా వండి వడ్డించే పని రాజమ్మది. చేపలు, మటన్, చికెన్ పెద్ద గిన్నెలలోవండాల్సి వచ్చేది. వారాంతంలో బంధువులు వస్తే రోజంతా పని చెయ్యాల్సి వచ్చేది. విశ్రాంతి వుండేది కాదు. సేటుకు ఆరుమంది పిల్లలు. వాళ్ళు రాజమ్మ వంటలను ఇష్టపడేవాళ్ళు. తమ ఫ్రెండ్స్ ఇంటికి వచ్చినప్పుడు కేకులు, శాండ్ విచ్ లు, స్వీట్లు చెయ్యించుకుని తినేవాళ్ళు.

పని విషయంలో యజమానులు కాస్త కఠినంగా వున్నా పిల్లలు చాలా ప్రేమగా మాట్లాడేవాళ్ళు. తన పిల్లలను వారిలో చూసుకుని మురిసిపోయేది రాజమ్మ. అలా తన కష్టాన్ని మరిచిపోయేది. ఆమెకు ఈ మధ్య శక్తి సన్నగిల్లుతోంది. వయసు పెరిగింది. శరీరం సహకరించడం లేదు. ఇక చాలు, నా పిల్లలతో నేను గడపాలి అని నిర్ణయించుకుని, తన దగ్గర ఉన్న ఆఖరి రూపాయి వరకు పోగేసి ఇండియాకు తిరుగు ప్రయాణమైంది.

ఈ పదేళ్లలో ఆమె దాదాపు 40 లక్షల రూపాయల వరకు భర్తకు పంపింది. ఆ డబ్బుతో తన భర్త ఊరిలో మంచి ఇల్లు కట్టాడని, పొలం కొన్నాడని, పిల్లలు పెద్ద చదువులు చదువుతున్నారని ఆమె నమ్మింది. మిగిలిన జీవితాన్ని స్వంత ఊరిలో భర్త, పిల్లలతో కలిసి సుఖంగా సంతోషంగా గడపాలని ఎన్నో కలలు కంది. విమానం దిగగానే తన కోసం భర్త, పిల్లలు పూలదండలతో ఎదురుచూస్తుంటారని భావిస్తూ ఆశతో కలలు కంటూ హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ఆమె విమానం దిగింది.

ఎయిర్‌పోర్టు బయట ఎంత వెతికినా భర్త కనిపించలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తోంది. కంగారుగా టాక్సీ పట్టుకుని తన ఊరికి వెళ్ళింది. ఊరు చేరుకోగానే ఆమెకు పెద్ద షాక్ తగిలింది. ఆమె పంపిన డబ్బుతో కట్టినట్టు చెప్పిన ఆ 'మేడ' అక్కడ లేదు. ముందున్న పాత పూరి గుడిసె కూడా కూలిపోయి జీర్ణావస్థలో ఉంది.

పక్కింటి వాళ్లు ఆమెను జాలిగా, వింతగా చూడసాగారు. గుసగుసగా ఏదో చెప్పుకుని నవ్వుకోసాగారు. "రాజమ్మా... నువ్వు పంపిన డబ్బుతో నీ భర్త ఊరి చివర మరో ఇల్లు కట్టుకున్నాడు. కానీ అది నీ కోసం కాదు. వేరే ఆవిడ కోసం. మూడేళ్ల క్రితమే అతను మరో పెళ్లి చేసుకుని, నీ పిల్లలను హాస్టల్లో పడేసాడు" అని ఒక ఇల్లాలు చెప్పింది.

రాజమ్మ కాళ్ల కింద భూమి కదిలిపోయింది. చలిజ్వరం వచ్చినట్లు వణికిపోయింది. పరదేశంలో పదేళ్ల రక్తాన్ని ధారబోసి సంపాదించిన డబ్బు, రెక్కలు అరిగేలా చేసిన కష్టం వృథా అయ్యాయని, తన పట్టుచీరలు, నగలు అన్నీ ఆ రెండో భార్య అనుభవిస్తోందని తెలిసి కుప్పకూలింది. అమ్మలక్కలు జాలిపడి ముఖంపై నీళ్ళు కొట్టి కాసిన్ని నీళ్ళు తాపించారు. కాసేపటికి కోలుకుని లేచి భర్త రాము దగ్గరకు పరిగెత్తింది.

కానీ అతను ఆమెను గుర్తుపట్టనట్లు నటించాడు.

"ఎవరు నువ్వు? కువైట్ నుంచి వస్తే నాకేంటి? ఆ డబ్బు అంతా పిల్లల ఖర్చులకే సరిపోయింది. నువ్వు డబ్బు పంపినట్లు నీ దగ్గర ఆధారం ఏముంది?" అని గొంతు పెంచి అరిచాడు.

గొడవ పెద్దదవ్వడంతో గ్రామస్థులు చేరారు. కానీ చట్టబద్ధంగా ఏ కాగితం ఆమె దగ్గర లేదు. పంపిన మొత్తం డబ్బు అంతా అతని ఖాతాలో ఉంది. ఆమె చేతిలో కేవలం పాస్‌పోర్ట్, ఒంటి మీద ఉన్న చీర, ఒక సూట్కేసులో పిల్లలకు కొన్న బట్టలు తప్ప ఏమీ మిగలలేదు. మోసపోయానని గ్రహించి ఆమె గుండె బద్దలయింది.

పిచ్చిదానిలో వీధిలో నేలపై పడి దొర్లుతూ మట్టిని చేతులతో ఎత్తిపోస్తూ భర్తను శాపనార్థాలు పెట్టసాగింది. ఆవేదనతో ఆక్రోశిస్తూ అనాథలా రాత్రంతా ఊరిచివర చెట్టుకింద కూర్చుని ఏడ్చింది. పదేళ్ల శ్రమ బూడిదలో పోసిన పన్నీరైంది.

పదేళ్ళు కుటుంబానికి, పిల్లలకు, ఊరికి దూరమై తను కువైట్‌లో పడిన కష్టాలు గుర్తొచ్చాయి. "ఎముకలు కొరికే చలిలో పని చేసిన రోజులు, మండుటెండలో ఖర్జూరాలు ఎండబెట్టి గింజలు తీసిన కాలం, పెద్ద గిన్నెలలో వండేటప్పుడు కాలిన చేతులు, యజమాని కొట్టిన దెబ్బలు... అన్నీ ఎవరి కోసం? మోసం చేసిన భర్త అనబడే ఈ నీచుడి కోసమా?" ఎవరో ఊరిలోనివాళ్ళు వచ్చి కాస్త అన్నం పెట్టారు. తమ ఇంట్లో చోటు ఇచ్చారు.

కానీ రాజమ్మకు మతి స్థిమితం లేదు. మరుసటి రోజు ఉదయం, ఊరి చెరువు దగ్గర పిచ్చిదానిలా జుట్టు విరబోసుకుని, పదేళ్ల తన సంపాదన గురించి కలవరిస్తూ కూర్చుంది.

ఊరి జనం ఆమెను చూసి "పాపం కువైట్ రాజమ్మ పిచ్చిది అయిపోయింది" అని చెప్పుకోసాగారు.

ఏడ్చి కన్నీళ్లు ఇంకిపోయాయి. పిల్లలు గుర్తొచ్చారు. కోపంతో రాజమ్మ కళ్ళు ఆ క్షణం నిప్పురవ్వల్లా మెరిసాయి. ఏడవడం వల్ల పోయిన డబ్బు తిరిగి రాదని ఆమెకు అర్థమైంది. శక్తి తెచ్చుకుని తన బిడ్డలు ఎక్కడ ఉన్నారో ఆరా తీసింది. వారు దగ్గరలోని ఒక అనాథాశ్రమం వంటి హాస్టల్లో ఉన్నారని తెలిసింది.

ఆమె ఆ ఆశ్రమం చేరుకుంది. పదేళ్ళ తర్వాత తనను చూసి గుర్తుపట్టిన బిడ్డలిద్దరూ ఏడుస్తూ వచ్చి కౌగిలించుకున్నారు. "అమ్మా, నాన్న మమ్మల్ని వదిలేశాడు" అని వెక్కి ఏడ్చారు. రాజమ్మ వాళ్ల కన్నీళ్లు తుడిచి, "భయపడకండి, మీ అమ్మ ఇంకా చావలేదు. కువైట్ ఎడారిలో బ్రతికిన నాకు, ఈ మనుషుల మధ్య బ్రతకడం ఒక లెక్క కాదు" అని ధైర్యం చెప్పింది.

భర్తతో పోరాడాలని, న్యాయం గెలవాలని నిశ్చయించుకుంది. గ్రామ పెద్దల సాయంతో, స్థానిక మహిళాసంఘం అండతో తన భర్తపై కేసు వేసింది. పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కింది. ఆఖరికి పోరాడి, తన కష్టార్జితంలో కొంత భాగాన్ని తిరిగి పొందింది. ఆ డబ్బుతో ఒక చిన్న టిఫిన్ సెంటర్ పెట్టుకుని, తన బిడ్డలను చదివించుకుంటూ, :ఎవరినీ నమ్మకూడదు, మన శ్రమపైనే మనకు నమ్మకం ఉండాలి" అనే పాఠాన్ని నేర్చుకున్నానంటూ తన కథను ఊరందరికీ చెప్పేది.

బికారిగా, పిచ్చిదానిగా మిగిలిపోవాల్సిన రాజమ్మ, ఒక పోరాట యోధురాలిగా నిలబడింది.

కానీ అంతటితో ఆమె కథ ముగియలేదు.

రాజమ్మ టిఫిన్ సెంటర్ పెట్టుకుని నిలదొక్కుకోవడం చూసి ఆమె భర్త రాము ఓర్వలేకపోయాడు. ఆమె పెట్టిన కేసు వల్ల అతని పరువు పోవడమే కాకుండా, తను అనుభవిస్తున్న ఆస్తిలో సగం ఇవ్వాల్సి వచ్చింది. అది అతడికి నచ్చలేదు. అతడు ఒక దుర్మార్గుడు. రాజమ్మ పంపిన డబ్బంతా తిని కూడా విశ్వాసం లేనివాడు.

తన రెండో భార్యతో కలిసి రాజమ్మను మళ్లీ రోడ్డుపైకి లాగాలని ఒక కుట్ర పన్నాడు. ఒక అర్ధరాత్రి, రాజమ్మ టిఫిన్ సెంటర్‌కు ఎవరో నిప్పు పెట్టారు. దురదృష్టవశాత్తూ ఆమెకు వున్నదంతా నాశనం అయిపోయింది. ఊపిరి పోసుకుంటున్న ఆమె ఆశలన్నీ అగ్ని కీలల్లో కాలి బూడిదయ్యాయి. మళ్ళీ కట్టుబట్టలతో రోడ్డుపై మిగిలింది రాజమ్మ

అంతటితో ఆగక, "ఆమె కువైట్‌లో ఉన్నప్పుడు తప్పుడు పనులు చేసి డబ్బు సంపాదించిందని, అందుకే యజమానులు వెళ్లగొట్టారని, ఆ కారణంతోనే తను రెండో పెళ్ళి చేసుకున్నాడని" ఊరంతా తప్పుడు ప్రచారం మొదలుపెట్టాడు రాము.

మొగవాడికి స్త్రీ కేరక్టర్ మీద దెబ్బకొట్టి ఆనందించడం ఒక పైశాచికత్వం. మానసిక దౌర్బల్యం. ఊరి జనం ఆమెను అనుమానంగా చూడటం మొదలుపెట్టారు. చేతిలో పైసా లేదు, ఉన్న ఆధారం కాలిపోయింది, పైగా నిందలు...

రాజమ్మ మళ్ళీ శూన్యంలో, దిగులుగా నిలబడింది. కానీ ఈసారి ఆమె ఒంటరి కాదు, తన పిల్లల భవిష్యత్తు ఆమె కళ్లముందు ఉంది. కానీ దిక్కులేనివారికి దేవుడు దిక్కై ఏదో ఒక విధంగా సహాయం చేస్తాడు.

అనూహ్యంగా దేవునిలా అదే సమయంలో, రాజమ్మ కువైట్‌లో పనిచేసిన యజమాని కొడుకు అబ్దుల్లా ఒక పని మీద భారత్‌కు వచ్చాడు. అతను రాజమ్మను చూడాలని వెతుక్కుంటూ ఆ పల్లెకు వచ్చాడు.

ఆమె నిజాయితీని మెచ్చి, ఆమెకు రావలసిన డబ్బు కొన్ని దినార్లు బాకీ ఇంకా కొంత ఉందని, అది ఇవ్వడానికి ఆమె కోసం వచ్చానని చెప్పి కొంత మొత్తాన్ని అందించాడు.

ఒక కువైటీ యువకుడు "ఎడారి మేఘంలా" కారులో వచ్చి రాజమ్మ కాళ్లు మొక్కి "ఆమె తనను పెంచి పెద్ద చేసిందని, పదేళ్ళు కువైట్ లోని తమ ఇంట్లో నిజాయితీగా పని చేసిందని, కోరిన వంటలు చేసి పెట్టిందని" చెప్పడం గ్రామస్తులకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

కథ మలుపు తిరగడంతో, రాజమ్మకు డబ్బు చేరడంతో ఊరి జనం రాజమ్మను పొగడటం ప్రారంభించారు.

రాము చేసిన ప్రచారమంతా అబద్ధమని తేలిపోయింది. రాజమ్మ ఆ డబ్బుతో ఒక ఇంటిని కొనుక్కుంది.

రాము, అతని రెండో భార్య మీద కేసు పెట్టింది. రాజమ్మ ఇప్పుడు లక్షాధికారి.

ఆమె వద్ద డబ్బు వుండటంతో భర్త "బుద్ధి వచ్చిందని" వచ్చి కాళ్లావేళ్లా పడినా ఆమె కరగలేదు.

"నువ్వు మోసం చేసింది నన్ను కాదు, నీ రక్తం పంచుకు పుట్టిన పిల్లలను..! ఈ రాజమ్మ ఇప్పుడు బికారి కాదు, తన కాళ్ల మీద తాను నిలబడ్డ ఒక యోధురాలు" అని గర్జించింది.

నేడు రాజమ్మ తన ఊరిలో కష్టాల్లో ఉన్న మహిళలకు ఉపాధి కల్పిస్తూ, ఎడారి ఎండల్లో మాడిపోయిన తన జీవితాన్ని పచ్చని పంటలా మార్చుకుంది. ఆమె కథ ఓటమి అంచున నిలబడివున్న ఎంతోమంది స్త్రీలకి ఒక ధైర్యం..!

(మరోకథ వచ్చేనెల)

Post your comments